International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.4, Issue-11(2), November, 2017
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

# మహీధర రామ్మోహనరావు నవల 'ఓనమాలు' లో తెలంగాణా పోరాట నేపథ్యం

-మెగావత్ ప్రమీల, M.A.

**రచయిత పరిచయం : మహీధర రామమోహనరావు**

పుట్టింది పెరిగిందీ సనాతన సంప్రదాయ యజ్ఞ యాగాదులు చేసుకునే కుటుంబంలోనే అయినా, అభ్యుదయ భావాలతో జీవించే అనేక ఉద్యమాల్లో పాల్గొని, ఆ జీవిత సారాంశాన్ని అందిస్తున్నట్లుగా అనేక నవలలు రాసిన రచయిత మహీధర రామమోహనరావు.

తూర్పు గోదావరి, జిల్లా కోనసీమ ప్రాంతంలోని ముంగండలో 1909న మహీధర రామమోహనరావు జన్మించారు. వీరి తాత ముత్తాతలు అందరూ వేద పండితులు. తండ్రి బ్రహ్మసమాజ ప్రభావం గలవాడు కావడం వల్ల తన కొడుక్కి రామోమోహనరావు అనే పేరు పెట్టుకున్నాడు. ఆ తండ్రి దగ్గరే రామమోహనరావు ఎక్కువగా చదువుకున్నారు. తరగతి గదుల కంటే గ్రంథాలయాల్లోనే ఎక్కువగా గడిపేవారు. గాంధీజీ సహాయ నిరాకరణ పిలుపు ప్రభావంతో హైస్కూల్ విద్య మధ్యలోనే ఆగిపోయింది. దానితో ఉద్యమాల వైపు అడుగులేశారు. ఆ ఉద్యమాలే విద్యాలయాలుగా హిందీ, రష్యన్, ఇంగ్లీష్, ఫ్రెంచ్, బెంగాలీ మొదలైన భాషల్ని నేర్చుకున్నారు. మొదట కాంగ్రేస్ వాదిగా, ఆ తరువాత కాంగ్రేసె సోషలిస్టుగా, చివరికి కమ్యూనిస్టుగా అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారు.

మహీధర రామ మోహనరావు సుమారు 15 నవలల్ని రాశారు. అనేక రచనల్ని అనువదించారు. 1954లో రథచక్రాలు; 1956లో ఓనమాలు;1957లో మృత్యువు నీడల్లో, 1991లో ఎవరికోసం; 1960లో కత్తుల వంతెన; 1965లో కొల్లాయిగట్టితేనేమి? 1969లో స్వయం వరణం; 1971లో ఈ దారి ఎక్కడికి; 1972లో అగ్ని గుండం; 1984లో దేశం కోసం; 1993లో జ్వాలా తోరణం నవలల్ని గ్రంథ రూపంలో వెలువరించారు. తెలంగాణా రైతాంగ పోరాటంలో, తూర్పుగోదావరి కోనసీమలో అట్టడుగు పొరల కూలిరైతులు భూస్వామ్యంపై సాగించిన ఉద్యమాన్ని చిత్రీకరించిన 'రథచక్రాలు' నవల 1948లోనే రాసినా అది 1954కి గాని గ్రంథ రూపంలోకి రాలేదు. మిగిలిన రచనలు కూడా వివిధ పత్రికల్లో సీరియల్‌గా వచ్చినా, గ్రంథరూపంలోకి రావడం మాత్రం ఆలస్యమైంది. వీటితో పాటు 'ఆ కథ అంతే' వంటి కథలను రాశారు.

'మబ్బుతెర', పరిష్కారము' వంటి నాటకాల్ని కూడా రాశారు. మరికొన్ని అభ్యుదయ రచనలను అనువదించారు. తన స్వగ్రామం ముంగండలో విశ్వ సాహిత్యమాలను స్థాపించి. దాని ద్వారా మార్క్సిస్టు పార్టీపై నిషేధకాలంలో రాయలసీమలో రహస్య జీవితాన్ని గడిపారు. పీడితుల పక్షాన నిలబడిన మహీధర రామమోహనరావు తాను పుట్టి పెరిగిన ప్రాంతం కాకపోయినా, తెలంగాణాలో జరిగిన సాయుధ పోరాటాన్ని సమర్థిస్తూ, ఆ చారిత్రక నేపథ్యాన్ని 'ఓనమాలు' నవలలో ఎంతో విపులంగా రాశారు. ఆయన రాసిన రచనలన్నీ ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన కమ్యూనిస్టు ఉద్యమ పరిస్థితుల్ని, నాటి ప్రజల పోరాట పటిమనీ కళ్ళకు కట్టినట్లు వివరిస్తాయి.

## మహీధర ఓనమాలు నవలలో ముఖ్యాంశాలు

తూర్పు గోదావరి జిల్లాలోని ఒక విస్తృత ప్రాంతంలో తాను భాగస్వామిగా ఉండిన పరిణామాలు కేంద్రంగా స్వాతంత్ర్యోద్యమ తీరుతెన్నుల్ని, ఆ ప్రాంత తెలుగు సమాజంలో కలిగిన సామాజిక చలనాన్ని స్వాతంత్ర్యానంతర కాలంలో మహీధర కొల్లాయి గట్టితేనేమి', 'దేశం కోసం', జ్వాలా తోరణం' అనే నవలాత్రయంగా రచించారని ఆ రచనల గురించి రాస్తూ ప్రముఖ విమర్శకుడు బి. సూర్యసాగర్ పేర్కొన్నారు. 'కొల్లాయి గట్టితేనేమి' 1920వ సంవత్సరంల గాంధీ సహాయ నిరాకరణోద్యమ నేపథ్యాన్ని, 'దేశం కోసం' 1935-39 కాలానికి, జ్వాలాతోరణం 1939-45 కాలానికి చెందిన ఇతి వృత్తాలతో కూడిన నవలలు ప్రపంచ యుద్ధ కాలంలో కమ్యూనిస్టుల పాత్ర, అంతర్జాతీయత వంటివన్నీ కనిపిస్తాయి. మరింత స్పష్టంగా చెప్పుకోవాలంటే, గాంధీ సంస్కరణ వాదం 'కొల్లాయి గట్టితేనేమి'లో కథానాయకుడు రామనాథం ఆ సంస్కరణ భావాల ప్రభావంతో నాడు హరిజనులని పిలిచే దళితులకు తనతోటలోని మంచినీటి బావిని తాగునీటి కోసం కేటాయిస్తాడు. రామనాథానికి, గాంధీ ఉద్యమం కోరేదేమిటో స్పష్టంగా తెలియకపోయినా, గాంధీ సంస్కరణ భావాల్ని ఆచరించే పాత్రగా కనిపిస్తాడు. ఈ నవల లక్ష్యాన్ని వ్యాఖ్యానిస్తూ బి. సూర్యసాగర్ ఇలా అన్నారు. "కొల్లాయి గట్టితేనేమి' లో సంస్కరణ వాదము కేంద్రదృక్పథంగా ఉన్నది. స్వాతంత్ర్యపోరాటంలో గాంధీ మార్గం యొక్క నిస్సారతను ఆ నవలలో పసికట్టడం కష్టమేమి కాదు. అయితే ఆ నిస్సారతను వెల్లడించడం మహీధర లక్ష్యం కాకపోవచ్చు" అందువల్లనే మౌలికమైన మార్పుల్ని గాంధీ సంస్కరణ వాదం కలిగించకపోయిందనీ, రామనాథం దళితులకు బావిని కేటాయించినా, దానిపై హక్కుని సాధించలేకపోయారని స్పష్టంగా దీన్ని బట్టి తెలుస్తుంది.

## ఓనమాలు నవలలో కథా వస్తువు

తెలంగాణలో జరిగిన విప్లవ పోరాటాన్ని మూడు దశలుగా విభజించుకోవచ్చు. 1930 నుండి 1944 వరకు ఆంధ్ర మహాసభ పరిణామం చెందుతూ, భాషా సాంస్కృతిక ఉద్యమంతో పాటు రైతాంగ సమస్యలపై ఆందోళన, పోరాటం చేసే స్థితికి, ఆ తరువాత మిలిటెంటు ఉద్యమ స్థాయికి అభివృద్ధి చెందిన మొదటి దశ.

నిజాం రెవెన్యూ, పోలీసుల, అధికారుల దౌర్జన్యాలు, దేశంలో భూ కబ్జాలకు వ్యతిరేకంగా పోలీసు, రజాకార్లను ఎదుర్కొనటం, సాయుధంగా దున్నేవానికే భూమిని రైతాంగమే అమలుపరచుకుంటూ, గ్రామ రాజ్యాలను ఏర్పరచుకోవటం. ఈ దశలోనే 3000 గ్రామాలలో నిజాం ప్రభుత్వం లేకుండా స్థానిక స్వరూపాలను నెలకొల్పుకోవటం జరిగింది. ఇది 1944 నుండి 1948 సెప్టెంబర్‌లో యూనియన్ సైన్యాలు పోలీసు యాక్షన్ పేరుతో ప్రవేశించే దాకా సాగింది. ఇందులో రెండు సంవత్సరాలు సాయుధంగా సాగింది. దీన్ని రెండవ దశగా చెప్పుకోవచ్చు.

మూడవ దశ : భూమిని కాపాడుకొంటూ యూనియన్ సైనిక బలాన్ని ఎదుర్కొంటూ గెరిల్లా రైతాంగ పోరాటం వరకు సాగిన దశ అది. 1948 నుండి 1951 వరకు సాగింది దీనిలో మొదటి దశకు చెందిన నవల 'ఓనమాలు', రచయితే దీనిలోని కథావస్తువుని ఇలా వివరించారు. నాటి తెలంగాణ ఒక అగ్నిగుండం. దుస్సహసమైనన జాగీర్దారీ వ్యవస్థను నిర్మూలించగల పోరాటాన్ని ప్రజానీకం కొనసాగిస్తోంది. వాటినన్నింటిని ఒకే జెండా కిందికి తెచ్చి, రాజకీయ నాయకత్వం సమకూర్చడానికై ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీ సన్నాహాలు సాగిస్తున్నాయి. రెండోవైపున విదేశీ పాలనకు, సంస్థానాధీశుల నిరంకుశ పాలనకూ వ్యతిరేకంగా జాతీయ ప్రజాతంత్ర పోరాటాలు తెలంగాణాని అలుముకున్నాయి. ఈ దశలో విచ్ఛిన్నమైపోతున్న జాగీర్దారీ వ్యవస్థను రక్షించగల శక్తి నిజాం ప్రభుత్వానికి లేదని గ్రహించిన భూస్వామ్య వర్గం, నూతన నాయకత్వం కొరకు వెతుకులాడుతూ జాతీయోద్యమంలో తనకు రక్షణ ఇవ్వగల శక్తుల్ని చూసుకుంది. సమాజంలా తనకున్న బలం క్రమంగా క్షీణించి పోతూంటే కూలిపోతున్న తన అధికారాన్ని పరిరక్షించు కొనేటందుకై మతవాదుల్ని, రౌడీల్ని సమీకరించి విధ్వంసకాండకు పూనుకొంది నిజాం సర్కారు. ప్రజానీకానికీ, ప్రగతి నిరోధక శక్తులకు మధ్య జరిగిన ఈ ఘర్షణలతో తెలంగాణా ఒక అగ్నిగుండమే అయ్యింది. ఆనాటి సంఘర్షణలే ఈ నవలకు కథావస్తువు.

**ఓనమాలు కథా సారాంశం**

తనకంటగట్టిన రోగిష్టి భర్త పెళ్ళైన ఏడాది తిరగకుండానే చనిపోవడంతో వితంతువవుతుంది సత్తెమ్మ. తన పొలంలో పనిచేసే వెంకటయ్యను కొన్నాళ్ళు తర్వాత కష్టపడి పెళ్ళి చేసుకుందామనుకుంటుంది. తల్లి పేరమ్మ, తమ్ముడు రంగయ్యలకు అది ఇష్టం లేదు. గ్రామం కూడా ఆ పెళ్ళిని వ్యతిరేకిస్తుంది.

'వెంకటయ్య' ఆంధ్ర మహాసభలో సభ్యుడు, ఆ సభని సంఘం అని పిలుస్తుంటారు. దొరల, జాగిర్దారీల, పోలీసుల దురాగతాల్ని వ్యతిరేకిస్తున్నందు వల్ల ఆ సంఘం నాయకుడు, మరి కొంతమంది సభ్యులు కలిసి సత్తెమ్మ చేసే జొన్నపొలంలో సమావేశమవుతుంటారు. నిజాం ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు పెట్టినా, అక్షరాలు నేర్చుకునే ఓనమాలు పుస్తకాల్ని కూడ తగలబెట్టినా రహస్యంగా అక్షరాలు నేర్చుకునేవారు. "ప్రజా శక్తి" పత్రికను రహస్యంగా చదువుకునే వారు. అందులో వెట్టి నిర్మూలన గురించి రాసే వార్తలు 'సంఘం' సభ్యులకెంతో ఆనందాన్ని కల్గించేవి.

దొర శివరామిరెడ్డిని, అందరూ పెద్దరెడ్డి అని పిలుస్తారు. అతనికి రమణారెడ్డి, రఘునంధనుడు అనే ఇద్దరు కొడుకులున్నారు. సుమిత్ర కూతురు. పెద్ద కొడుకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్. అతడు చాలా దుర్మార్గుడు. రెండవ కొడుకు రఘునందనుడు, తాను అమెరికా ప్రభావం గల ఆర్థికవేత్త కావాలని ఆశ పడుతుంటాడు. యంత్రాలతో వ్యవసాయం చేసి దేశాన్ని బాగుచేయాలనే దేశభక్తి అతనిది. దున్నే వానికి భూమి దక్కాలని కమ్యూనిస్టులంటుంటే, యంత్రాలతో ఎన్ని వేల ఎకరాలైనా దున్నించగల సమర్థత తనకే ఉందని, తనకే వేలాది ఎకరాలు దక్కాలంటూ మార్క్స్ సిద్ధాంతాన్ని వక్రీకరించగలిగిన సామర్థ్యం గలిగినవాడు.

అప్పటికే, సత్తెమ్మ తమ్ముడు రంగయ్య 'లా' చదివాడు. సంస్కరణల గురించి మాట్లాడుతుండే వ్యక్తి. కానీ, ఇంట్లో అలాంటి సంస్కరణల్ని అమలు చేయటానికి ఇష్టపడడు. అందుకే తన అక్క సత్తెమ్మ, పాలేరు వెంకటయ్యని పెళ్ళి చేసుకోవాలనుకుంటే వ్యతిరేకిస్తాడు. మధ్య తరగతి మేధావి ఆలోచనలన్నీ పుణికి పుచ్చుకున్నవాడు. సమయానుకూలంగా ప్రవర్తించగలిగే నేర్పున్నవాడు.

సత్తెమ్మే ఏకైక దిక్కై పొలం చూసుకునేది. వాళ్ళ తాత ముత్తాతలకు 'దొర' గారి తాతలు ఇచ్చిన ఆ భూమిని శ్రద్ధగా బాగుచేయించేది. వెంకటయ్యతో సంబంధం చెడిపోయినా, తర్వాత పొలం గురించి

పట్టించుకోకపోయినా, వెంకటయ్య సూచన మీద సరయ్యను పాలేరుగా పెట్టి, అప్పుడప్పుడు పొలం చూసి వచ్చేది. సరయ్య పాలేరుగా ఉండటం వల్ల వెంకటయ్య వాళ్ళ సంఘం సభ్యులు రాత్రి వేళలో అక్కడ మీటింగులు పెట్టుకోవడానికి వీలు చిక్కేది. త్వరలో కూలీ రాజ్యం వస్తుందని, అప్పుడు అందరి సమస్యలు తీరిపోతాయని చర్చించుకుని సంతోషపడేవారు.

నైజాము అండను చూసుకొని పోలీసులు, ఉద్యోగులు, గ్రామ ప్రజల ధన, మానాల్ని దోచుకునేవారు. ఆచారం పేరుతో కట్నకాసుకల్ని బలవంతంగా వసూలు చేసేవారు. ఇవ్వకపోతే శిక్షించేవారు. గొల్లల దగ్గర పాలు, మేకలు లాక్కునేవారు. గ్రామాల్లో కనీస అవసరాలు కూడా కల్పించేవారు కాదు. పాఠశాల, ఆసుపత్రి వంటి సౌకర్యాలేమి కల్పించేవారు కాదు. మరోవేపు దొర కొడుకులు ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ ఆ బాధ్యతలు నిర్వహించడం నచ్చక, వాటిని మానేసి యంత్రాలతో వ్యవసాయం చేయించాలనుకుంటారు. చిన్న కమతాలు ఉండటం వల్లే దేశాభివృద్ధి జరగడం లేదంటారు. దాన్ని తండ్రి ప్రోత్సహిస్తుంటాడు.

ఒకరోజు రంగయ్యని పిలిపించి దేశాభివృద్ధి కోసం తామంతా పెద్దపెట్టున పాటు పడాలని భావిస్తున్నట్లు చెప్పి, తమ తాత ముత్తాతలు వాళ్ళకిచ్చిన భూమిని తిరిగి ఇచ్చేయమంటాడు. అంతవరకు ఆ వ్యవసాయాన్ని చేసుకోవడం వల్లే వాళ్ళ కుటుంబమంతా అభవృద్ధిలోకి వచ్చిందని చెప్పాడు. ఆ విధంగా రంగయ్య చదువుకోవడానికి, వాళ్ల కుటుంబం అభివృద్ధిలో ఉండటానికి తమ తాతలిచ్చిన భూమే కారణమని స్పష్టం చేస్తాడు. ఇంక ఆ భూమిని తిరిగి ఇచ్చేస్తే దేశాభివృద్ధికి పాటు పడతానంటాడు. దాంతో రంగయ్య ఖంగుతింటాడు.

దొర తమ పొలం తిరిగిచ్చేయమనడానికంతటికీ సత్తెమ్మ రెండో పెళ్ళి చేసుకోవాలనుకోవటమే కారణమై ఉంటుందని తల్లి వీరయ్యకు చెప్తుంది. అందుకు పరిహారంగా కొంత ఏదైనా ఇచ్చిక్షమించమని అడగాలని కూడా సలహా ఇస్తుంది. ముందు అది నిజమనుకుంటాడు రంగయ్య, కానీ, ఆచారాల పేరుతో కట్న కానుకల్ని బలవంతంగా లాక్కునే అలవాటు దొరలకు మామూలే కదా అని తన స్కూలు నాడు బహుమానాల్ని బలవంతంగా తీసుకోవడాన్ని తాను వాటిని వ్యతిరేకించిన రోజుల్ని గుర్తుచేసుకుంటాడు.

మరోవైపు రంగయ్య తన లాయరైన మామగారు గోపాలరావుని కలిసి కోర్టుకి వెళ్లాలనుకుంటాడు. కానీ, గోపాలరావ అది అంత సులువుగా తేలే విషయం కాదని అనేక ఉదాహరణలతో వివరిస్తాడు.

ఇంటికి వచ్చేలోగా తమ పొలాన్ని దొర మనుషులు స్వాధీనం చేసుకోవటానికి వచ్చినట్లు, దాన్ని తన అక్క సత్తెమ్మ, ఊరి ప్రజలు కలిసి ఎదుర్కొన్నట్లు విని సంతోషపడతాడు. దొర ప్రజల తిరుగుబాటుని గమనించి, తగిన సమయం కోసం ఎదురు చూస్తుంటాడు. వెంకటయ్యని పిలిచి సత్తెమ్మకి ఆ పొలం ఇవ్వలనుకుంటున్నానీ, ఆ విషయం ఆమెతో చెప్పకపోవడం వల్లనే ఆమె అపార్థం చేసుకుందనీ చెప్తాడు దొర. సత్తెమ్మను వెంకటయ్య పెళ్లి చేసుకుంటే సహకరిస్తానని హామీ ఇస్తాడు తప్ప గతంలో వాళ్ల దగ్గర లాక్కున్న భూమినిస్తానని మాట మాత్రం కూడా అనదు. ఆ మాటల్లోని కుట్రను వెంకటయ్య గమనిస్తాడు. ఈ లోగా ఖాశీం రజ్వీ ముస్లిముల కోసం పోరాడుతున్న గొప్ప వ్యక్తి అనీ, హిందువుల నుండి ముస్లిములు రక్షించబడాలంటే, నైజాం ప్రభుత్వమే ఉండాలని, లేకపోతే ముస్లిములు బతలేరని, అందుకనే 'అజాద్' హైదరాబాదు కావాలని తామంతా పోరాడుతున్నట్లు, తామంతా ముస్లిముల రక్షణ కోసమే జీవిస్తున్నట్లు బుడాన్ ప్రచారం చేస్తుంటాడు.

మరోవైపు ఇండియన్ యూనియన్‌లో కలవకుండా హైదరాబాదు ఒక ప్రత్యేక దేశంగా ఉండాలని నిజాం భావించడం, దాన్ని వ్యతిరేకించే ప్రజల్ని భయభ్రాంతుల్ని చేయటానికి ఢిల్లీ నుండి ఆయుధాల్ని రప్పించి అల్లకల్లోలం చేయడం వంటి అకృత్యాలు చేయిస్తుంటాడు. ఖాశీం రజ్వీ ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నా, చూసి చూడనట్లు వ్యవహరిస్తుంది నైజాం ప్రభుత్వం. ఒక రోజు కొంతమంది ఊరి మీదకు ఆయుధాలతో వచ్చి ఊరేగింపు చేసి, అందరిచేత 'ఆజాద్–హైదరాబాదు' అని బలవంతంగా నినాదాన్ని ఇప్పిస్తుంటారు. రోడ్డు పక్కన వున్న ఒక ముసలివాడైన ముష్టివాడ్ని కూడా అలాగే చెప్పమంటారు. అతడికి నోరు తిరగదు. అయితే అతను వ్యతిరేకిస్తున్నాడనుకుని, తాగేసి చిందులు తొక్కుతున్న ఆ ఊరేగింపులోని ముస్లిములు ఆ ముసలి వాణ్ణి సరికేస్తారు. రక్తం కారడం చూసి, అతను చనిపోయాడని తెలిసి, ఆ ఊరేగింపులోని కొంతమంది వెనక్కి పరుగుతీస్తారు. అది చూసి ఊళ్లో ప్రజలు ఆ ముసలివాడి దగ్గరకు వెళ్ళడం, ఆ జనాన్ని చూసి ఊరేగింపు చేస్తున్న జనం తమని కొట్టడానికొస్తున్నారని అనుకొని పారిపోతారు. ఆ తర్వాత ఆ ముసలివాడి శవాన్ని ఊరేగింపుగా తీసుకెళ్ళతారు. ఆ ఊరేగింపులో సంఘం నాయకులు కూడా పాల్గొంటారు. ప్రజలకు నైజాం వైపు వ్యతిరేకతను, యూనియన్ ప్రభుత్వం పట్ల సానుకూలతను కల్గిస్తారు. ఈ సంఘటన జరిగిన తర్వాత దొర పెద్ద కొడుకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొంత మందిని అరెస్టు చేసి, వారిని హింసిస్తుంటాడు. వెంకటయ్యను అరెస్టు చేస్తాడు. సంఘం నాయకులు ఎక్కడుంటారో చెప్పమని వేధిస్తుంటాడు. ఈ లోగా సత్తెమ్మ, కొంతమందిని

వెంటేసుకొచ్చి వాళ్లందరితో తిరుగుబాటు చేస్తుంది చాకలి మంగమ్మ అక్కడున్న తుపాకీని తీసి దొరలపై గురి పెడుతుంది. జనం ఏకమవుతారు. దొరలు పారిపోతారు. నవల ముగుస్తుంది.

**ఓనమాలు నవల ప్రత్యేకత**

తెలంగాణా ప్రాంతంలో నైజాం ప్రభుత్వం, దాన్ని బూచిగా చూపి పోలీసులు, జాగీర్దారులు, కొంతమంది ముస్లింలు చేసే అకృత్యాలు, దుర్మార్గాన్ని అవగాహన చేసుకోవడానికి 'ఓనమాలు' నవల ఎంతగానో సహకరిస్తుంది. అప్పుడు జరిగిన చారిత్రక సంఘటనలన్ని సన్నివేశాలుగా, పాత్రలుగా రూపొందించటంలో రచయిత మహీధర రామ్మోహనరావు ప్రదర్శించిన సృజనశీలత ప్రశంసనీయం. ఒక కుటుంబంలో జరుగుతున్న కథనే చెప్తున్నట్లున్నా, ఆ సంఘటనల తీవ్రతను అద్భుతంగా వర్ణించి, ఆ సమస్యలు ఒక కుటుంబానికే పరిమితమైనవి కాదని పాఠకుడు గ్రహించేటట్లు, ఆనాటి చారిత్రక సంఘటనల్ని అర్థం చేసుకునేట్లు నవల్ని అద్భుతంగా కొనసాగించారు.

తెలంగాణాలో ఉర్దూ, పారశీక భాషల ఆధిపత్యం మధ్య నలిగిపోయిన తెలుగు భాష 'ఓనమాలు' నేర్చుకోవాలన్నా ఎలాంటి పరిస్థితి ఎదుర్కోవలసి ఉంటుందో దొంగచాటుగా 'ఓనమాలు' పుస్తకాన్ని తెచ్చుకొని, సత్తెమ్మ చేసే బోళ్ల పొలంలో సంఘం సభ్యులు రహస్యంగా చదువుకోవటం తెలుపుతుంది. ఆ పుస్తకాన్ని కూడా దొరల మనుషులు చింపేస్తుంటే కొన్ని కాగితాలు దాచుకున్నారట!.

నాడు ఆంధ్ర మహాసభ కల్గించిన చైతన్యం విప్లవాత్మకమైంది. పేద వర్గాల సమస్యల్ని పోరాట పంథాలో భాగం చేయగలగడం వల్ల మరింత శక్తివంతంగా 'సంఘం' సామాన్య జన వ్యవహారంలోకి రాగలిగింది. చిలుకూరులో వెట్టి వ్యతిరేక తీర్మానం చేసినా, దాన్ని భువనగిరి మహాసభ కార్యరూపంలో పెట్టిన తర్వాత సంఘం సామన్య జనంలోకి చొచ్చుకుపోగలిగింది. వాటిని రహస్యంగా మరో వారం రోజుల తర్వాతనైనా చదివి చైతన్యం పొందే వారంటే సంఘం, ఆ పత్రికలు తెచ్చిన చైతన్యం ఎంత గొప్పదో తెలుస్తుంది.

సంఘం అన్ని కుల వృత్తుల వాళ్ళననీ ఐకం చేసి నిర్బంద చాకిరీ నుండి విముక్తి కలిగించాలని ప్రయత్నించింది. సంఘం సభ్యుల మీద ఎన్ని నిషేధాలు ఉన్నా చాకలి మంగమ్మ వంటి వాళ్ళు ఆ నాయకుల్ని కాపాడేవారని తెలుస్తుంది. ఆ నాయకులు కూలీరాజ్యం వస్తుందనే వారు. అప్పుడు అణగారిన వర్గాల వారే పాలకులవుతారని, వారి సమస్యల్ని వాటి పరిష్కారాల్ని వారి చేతనే చెప్పించటం వలన సంఘం సభ్యులు ఎలాంటి కార్యాచరణను కొనసాగించే వారో అర్థమవుతుంది.

**International Journal of Academic Research**
**ISSN: 2348-7666; Vol.4, Issue-11(2), November, 2017**
**Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in**

వెంకటయ్యను సత్తెమ్మ, రెండో పెళ్ళి చేసుకోవాలనుకోవటం, సావిత్రి తల్లి, అనసూయమ్మ, ముంతాజ్ వంటి స్త్రీల అక్రమ సంబంధాలు విషయంలో నాటి పాలకుల ప్రజల విధానాల్ని, ఆకాంక్షల్ని అర్ధంచేసుకోవచ్చు. బుడాన్ పొద్దున్నుండి రాత్రి వరకు అనసూయమ్మ ఇంటి దగ్గరుండి, ఓ దొర నరిసిరెడ్డి లాగేసుకున్న ఏభయ్యేకరాల భూమిని మళ్ళీ స్వాధీనం చేసుకోవడానికి ఖాసీం రజ్వీ అనుయాయి, పెద్దజాగీర్దార్ ఖాజీ మహమ్మద్ రసూల్‌తో మాట్లాడానికి చెప్పి, అత్తా కోడళ్ళను మోసగించి, కోడల్ని శారీరకంగా అనుభవించే సంఘటనల్ని చదివినప్పుడు, ప్రజలెలా మోసపోయేవారో అర్థమవుతుంది. నాడు ప్రభుత్వం కోర్టులు, చట్టం, పట్టించుకోని భూ వ్యాజ్యాల్ని పరిష్కరించుకోవటానికి అక్రమ సంబంధాల్ని కూడా తప్పనిసహి పరిస్థితుల్లో అంగీకరించవలసి వచ్చేదని, అది ప్రజలకు తెలిసి పరువు, ప్రతిష్టల్ని కోల్పోవలసి వచ్చేదని స్పష్టమవుతుంది.

**ముగింపు :**

తెలంగాణాలో సాయుధపోరాటం జరగడానికి సమాజంలో స్పష్టంగా వర్గాలుగా విడిపోయిన పరిస్థితి కనిపిస్తుంది. భూస్వాములు, ఉన్నత వర్గం, మధ్యతరగతి, పేద వర్గంగా వాళ్ళు విడిపోయారు. కులం, వారి వృత్తులతో సంబంధం లేకుండా అందరూ ఒకేరకమైన పీడనను అనుభవించినట్లు నవలలో కనిపిస్తుంది.